# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం 21 డిసెంబరు 2025 www.prajaswaramdaily.com 4 pm





## సమ్మక్క-సారలమ్మ మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్, ప్రజాస్వరం

మేడారం మహా జాతర 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఆవిష్కరించారు. అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక వేడుక మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహా జాతర 2026 జనవరి 28 నుంచి జనవరి 31 వరకు జరగనుంది. మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ గారు, ధనసరి అనసూయ (సీతక్క) , పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

## పంచాయతీల్లో కాంగ్రెస్ పై

# వ్యతిరేకత స్పష్టం

### గర్వంతో ఎగిరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్పారు

**నా దూషణే.. ప్రభుత్వం పని**

**చనిపోవాలని శాపాలు పెట్టడమే విధానం**

**బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్**

**శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గ భేటీ తెలంగాణ భవన్‌లో సమావేశం**

హైదరాబాద్, ప్రజాస్వరం

"పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలైతే బీఆర్ ఎస్ సత్తా తెలిసేది. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు అని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అన్నారు. గర్వంతో ఎగిరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ది చెప్పారన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు అహంకార వైఖరి ప్రదర్శించలేదన్నారు. కాంగ్రెస్ ఒక్క కొత్త పాలసీ కూడా తేలేదన్నారు.. తీసుకొచ్చిన పాలసీ.. రియల్ ఎస్టేట్ కోసమేనని, రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిందని, ఒకప్పుడు యూరియా ఇంటికి, చేను వద్దకు వచ్చేదని, ఇప్పుడు యూరియా కోసం కుటుంబమంతా లైన్ లో నిలబడే పరిస్థితి వచ్చింది" అని కేసీఆర్ విమర్శించారు. బీఆర్ ఎస్ శాసనస భాపక్షం, రాష్ట్ర కార్యవర్గ భేటీ తెలంగాణ భవన్ లో ప్రారంభమైంది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యవర్గసభ్యులతో కేసీఆర్ భేటీ అయ్యారు.



**ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించినట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. తనను దూషించడం, చనిపోవాలని శాపాలు పెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని విమర్శించారు.**

## ఎన్నికప్పుడు ఇచ్చిన హామీలు గాలికొదిలేశారా?



**విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలా?**

**సోనియాకు కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**

హైదరాబాద్ : 'ఆనాడు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టి.. మళ్లీ ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు, మేనిఫెస్టో అమలు గురించి ఏనాడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా? అని అడిగారు. కనీసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి ఆరా తీశారా? అంటూ ఓ బహిరంగ లేఖ రాశారు.

**'ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేశారా? ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? గాంధీభవన్‌లో పాతరేశారా? తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. ఇప్పటికైనా కొత్త ఊహలు, కొత్త ఆశలు, కొత్త హామీలు కల్పించే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే మీరు ప్రయోగించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహం రూపంలో మీ పాలిట భస్మాసుర హస్తమై అధికారానికి దూరం చేస్తుంది. తెలంగాణ ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారు" అని కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.**

## సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య అరెస్ట్

**ఆయన్ను అదుపులోకి తీసుకొన్న ఎన్ఐఏ**

**మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు...**

వరంగల్,ప్రజాస్వరం

సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల మరణించిన మావోయిస్టు నేత కాతా రామ చంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేసి ప్రజలను ప్రేరేపించారనే ఆరోపణలపై అరెస్ట్ చేశారు. జనగామ జిల్లా జాఫరగఢ్ మండల కేంద్రంలో ఆయన నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి నాలుగు వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ అధికారులు.. ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఎన్ఐఏ కోర్టులో ఇన్నయ్యను హాజరుపరిచే అవకాశముంది.





## రైల్వే ప్రయాణికులపై చార్జీల భారం

**26 నుంచి అమల్లోకి**

ఢిల్లీ, ప్రజాస్వరం

**టికెట్ ధరలను పెంచుతూ రైల్వేశాఖ ప్రకటన చేసింది. ఈనెల 26 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆర్డినరీ క్లాస్‌లో 215 కి.మీల కంటే తక్కువ దూరం ప్రయాణికులకు ఎలాంటి ఛార్జీలు పెంచలేదు. అంతకంటే ఎక్కువ దూరం వెళ్లే.. ఆర్డినరీ క్లాస్ రైలు టికెట్ ధర కిలోమీటరకు 1 పైసా చొప్పన పెంచింది. మెయిల్,ఎక్స్‌ప్రెస్ ఏసీ, నాన్-ఏసీ రైళ్లలో కిలోమీటరకు 2 పైసలు చొప్పున ఛార్జీలు పెంచింది. ఇక నాన్-ఏసీ ట్రైన్‌లో 500 కి.మీ దూరం ప్రయాణించే వారు అదనంగా రూ.10 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 26 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. రైల్వేకు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని శాఖ అంచనా.**

## అప్పులోళ్ల టార్చర్.. దంపతుల ఆత్మహత్య

సిద్దిపేట, ప్రజాస్వరం

అప్పుల బాధ భరించలేక దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. దాచారం గ్రామానికి చెందిన వడ్లకొండ శ్రీహర్ష (32), రుక్మిణి(25) దంపతులు. వీరికి మూడేళ్ల కుమార్తె హరిప్రియ ఉంది. బెజ్జంకి మండల కేంద్రంలో రెండేళ్లుగా దుస్తుల దుకాణం నిర్వహణతో పాటు కుటుంబ పోషణకు శ్రీహర్ష అప్పు చేశాడు. మరికొందరికి మధ్యవర్తిగా ఉంటూ ఇతరుల వద్ద అప్పులు ఇప్పించాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి కొద్ది రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఆదివారం తెల్లవారుజామున అద్దె గదిలో దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. తల్లిదండ్రులకు ఏమైందో తెలియక హరిప్రియ కేకలు వేసింది. ఇంటి యజమాని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దంపతులు ఇద్దరూ చనిపోయారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఏస్ఐ సౌజన్య విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు ముందు శ్రీహర్ష రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

**మాసాయిపేట్ డిసెంబర్ 22( ప్రజాస్వరం)**

సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా సౌందర్య రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచులు సమావేశమై ఈ కమిటీని ఎన్నుకున్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ల ఐక్యతతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫర్ అధ్యక్షునిగా వీరన్న గారి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి ఉపాధ్యక్షుడు రమేష్. సౌందర్య రఘు కార్యదర్శిలు రాములు కోశాధికారి దీప్తి కార్యవర్గం సభ్యులు ప్రశాంత్ రేణుక. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి సొసైటీ డైరెక్టర్ ఉదండపురం నరసింహులు తదితరులు పాల్గొన్నారు



## హైడ్రా కమిషనర్ గన్ మెన్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య

ఎల్బీనగర్, ప్రజాస్వరం



హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగత గన్ మెన్ ఆదివారం తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు వెంటనే ఎల్బీనగర్ లోని కామినేని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ గన్ మెన్ కృష్ణచైతన్య హయత్ నగర్ నివాసం ఉంటున్నాడు. తన నివాసంలో ఆదివారం గన్ తో కాల్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.